సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం, 29, సెప్టెంబర్, 2025



స్కూటర్ ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

ఒంటిమిట్ట మండలంలోని మంటపంపల్లి సమీపాన ఇరుకురాళ్ల బోటు వద్ద స్కూటర్ ఢీకొని వృద్ధురాలు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. -8లో



బొమ్మల కొలువు.. సంప్రదాయాలకు నెలవు

దసరా అంటేనే సందడి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.100	రూ.140



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 236 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	570	600
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 109.600 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 29వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ నుంచి పత్రికలకు అందజేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వాట్సాప్ సేవలను బహిష్కరించిన వైద్యులు



రాయచోటి: సమ్మెలో భాగంగా గ్రామీణ ప్రాథమిక వైద్యులు ప్రభుత్వ అధికారిక వాట్సాప్ గ్రూప్ సేవలను బహిష్కరించారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఆదివారం అన్నమయ్య జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 1వ తేదీ వరకు సమ్మె వివిధ రూపాలలో కొనసాగుతుందని గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తెలిపారు. ప్రభుత్వం దిగి రాకపోతే మూడవ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

హార్సిలీహిల్స్‌పై సందడే సందడి



కొండపై సందర్శకులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సందర్శకులతో కిటకిటలాడింది. దసరా సెలవులు ఉన్నా సందర్శకుల తాకిడి తగ్గింది. అయితే ఆదివారం రద్దీ ఒక్కసారిగా పెరిగింది. దీనితో గాలిబండ, వ్యూపాయింట్లు నుంచి సందర్శకులు చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ప్రకృతి అందాలను తిలకించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన షబ్బీర్ హుస్సేన్

కలికిరి: మండలంలోని మహల్‌కు చెందిన ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ హుస్సేన్ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో సదుంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని షబ్బీర్ హుస్సేన్ తెలిపారు.కె.రియాజ్ అహ్మద్, జహీద్, సుభాన్, సాధిక్, మస్తాన్, సుల్తాన్, సునీల్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా..కాపాడవమ్మా



గంగమ్మ దేవతను దర్శించుకుంటున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తల్లీ ..కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవార్లను వేడుకున్నారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతపురం గంగమ్మను లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎర్రగుంట్ల జెడ్పీటీసీ బాలయ్య, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివారెడ్డి దర్శించుకున్నారు.ఆలయ అధికారులు వారిని సత్కరించారు.పూజల్లో ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ నారాయణ, శంకర్ నాయుడు, జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్‌లు సంజీవరెడ్డి, రాజబాబు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, మైనార్టీ నాయకులు చాన్ బాషా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ దిశగా మదనపల్లె!

- ● మున్సిపాలిటీలో కలిసిపోయిన 12 గ్రామపంచాయతీలు
- ● 2011 లెక్కల ప్రకారం జనాభా 1.36 లక్షలు, 33,136 గృహాలు
- ● ఇవికాక ఇందిరమ్మ, జగనన్న ఇళ్లు



మదనపల్లె: మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న మదనపల్లెను 1961 ఏప్రిల్ ఒకటిన మున్సిపాలిటీగా ఏర్పాటు చేయగా..తర్వాత అంచెలంచలుగా శ్రేణి మారుతూ ఇప్పుడు సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా కొనసాగుతోంది. గడిచిన 15 ఏళ్లలో మదనపల్లె మున్సిపాలిటీ రూపురేఖలు గుర్తుపట్టలేనంతగా మారింది. పట్టణ ప్రాంత విస్తరణ శరవేగంగా సాగుతోంది. శివారుప్రాంతాలు పట్టణంలో కలిసిపోయి నివాస గృహాలు ఏర్పడుతుండగా, శివారులోని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలోకి దాదాపుగా కలిసిపోయాయి. పేరుకు పంచాయతీలే అయినా పట్టణంలో కలిసిపోయాయి. దీంతో ఇవి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నట్టు కనిపించడం లేదు. పట్టణ పరిధిలో ఉన్నట్టుగానే కనిపిస్తుంది. పారిశ్రామిక, విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో విస్తరణ వేగమందుకుంది. కార్పొరేట్ సంస్థలు, ప్రముఖ కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ఈ వేగంతో మదనపల్లె మున్సిపాలిటీ కార్పొరేషన్ స్థాయికి చేరువైంది.

2 లక్షలు దాటిన జనాభా

మదనపల్లె మున్సిపాలిటీ జనాభా లెక్కలపై కచ్చితమైన అంకెలు లేవు. 2011 తర్వాత జనాభా లెక్కలు తీయలేదు. మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి, కుటుంబ సభ్యుల సంఖ్య, ఇతర వివరాలు లేవు. అయితే 2011 లెక్కల ప్రకారమే పట్టణం 14.20 కిలోమీటర్లలో విస్తరించింది. ఇందులో నివాసగృహాలు 33,136 ఉన్నట్టు లెక్క. జనాభా పరంగా చూస్తే 1,36,414 మంది. మున్సిపల్ అధికారుల అంచనా ప్రకారం ప్రస్తుత జనాభా 1.68 లక్షలు, ఇళ్లసంఖ్య 38,248 ఉన్నట్టు చెబుతున్నారు. అయితే వాస్తవ లెక్కకు ఇది మాత్రం సరిపోదు. మున్సిపాలిటీ చాలా కిలోమీటర్లు విస్తరించింది. 15 ఏళ్లలో మున్సిపల్ సరిహద్దు దాటుకుని పుంగనూరురోడ్డు, బైపాస్‌రోడ్డు, అమ్మచెరువుమిట్ట, బాబూకాలనీ, బెంగళూరురోడ్డు, చిప్పిలి, కొత్తిండ్లు, ఈశ్వరమ్మకాలనీ, బసినికొండ, వలసపల్లెరోడ్డు, వన్నూర్‌సాబ్‌గుట్ట, నిరుగట్టువారిపల్లె, సిటిఎంరోడ్డు ప్రాంతాలు ఊహకందని విధంగా విస్తరించాయి. దీంతో ప్రస్తుత మున్సిపాలిటీ జనాభా రెండు లక్షలకు మించిపోయింది.

12 పంచాయతీలు కలిసిపోయాయి


మదనపల్లె మున్సిపాలిటీ చుట్టూ 12 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇవి పేరుకు మాత్రమే పంచాయతీలు..పట్టణంలో కలిసిపోయి కనిపిస్తాయి. వీటిల్లో 2011 లెక్కల ప్రకారం 55,455 మంది జనాభా ఉండగా ఇళ్ల సంఖ్య 10వేలకుపైమాటే. ప్రస్తుత అంచనా మేరకు జనాభా 75 వేల వరకు, ఇళ్లసంఖ్య 15వేల దాకా ఉండొచ్చని అంచనా. 2011 లెక్కల ప్రకారం మున్సిపాలిటీ, పంచాయతీల జనాభా, ఇళ్ల సంఖ్యను కలిపితే రెండు లక్షల జనాభా, 50వేల ఇళ్లు ఉంటాయి.

పక్కా గృహాలు వేలల్లో...

2005లో దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు, 2019–24 మధ్యలో మంజూరైన జగనన్న ఇళ్ల సంఖ్య వేలల్లో ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు మున్సిపల్ రికార్డుల్లో కనిపించవు. వీటకి పట్టణ ప్రణాళిక అనుమతి అవసరం లేకపోవడంతో నిర్మాణ లెక్కల్లో ఉండవు. దీంతో మున్సిపాలిటీ లెక్కల్లోలేని ఈ వేల గృహాలు, ఇందులో నివసిస్తున్న కుటుంబ సభ్యుల జనాభా వివరాలను లెక్కిస్తే జనాభా రూ.2.5 లక్షలు దాటవచ్చని అంచనా.

కొండలెక్కిన ఇళ్లు

మదనపల్లె పట్టణంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాగా మిగిలిన కొండలు, గుట్టలపై పేదల నివాసాలు ఏర్పరచుకుంటున్నారు. 1996లో మదనపల్లెకు వరదలు సంభవించగా బాధితులకు వన్నూర్‌సాబ్ గుట్టపై ఇళ్లను నిర్మించి ఇచ్చారు. దాన్ని బాబూ కాలనీగా పిలుస్తారు. అప్పట్లో గుట్టలపై ఉన్న ఏకైక కాలనీ ఇదే. ప్రస్తుతం ఈ గుట్టంతా ఇళ్లమయమైంది. చంద్రాకాలనీ, బాబు కాలనీ పడమరవైపు, వైఎస్సార్‌కాలనీ, ఎర్రగానిమిట్ట, అమ్మచెరువుమిట్ట, రామారావు కాలనీపైన, తిరుపతిరోడ్డుల్లోని గుట్టలపై ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. ఈ ఇళ్లలెక్క ఇప్పటికీ తేలలేదు. వీటిలో మున్సిపల్ లెక్కల్లో ఉన్న ఇళ్లసంఖ్య అతితక్కువ. జనాభా లెక్కల సేకరణ ప్రారంభమయ్యాక మున్సిపాలిటీ వాస్తవ లెక్కలు తేలుతాయి.



కొండలెక్కిన ఇళ్లు

మదనపల్లె పట్టణ గణాంకాలు..

- విస్తీర్ణం: 14.20 కి.మీ
- రెవెన్యూవార్డులు: 17
- ఎన్నికల వార్డులు: 35
- నివాసగృహాలు: 33,136
- మున్సిపాలిటీ ఏర్పడింది: 1.4.1961
- ప్రస్తుతం: సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ

కలిసిపోయిన పంచాయతీలు

పంచాయతీ	జనాభా
కొత్తపల్లె	7,652
కొత్తిండ్లు	2,672
ఈశ్వరమ్మకాలనీ	6,859
కురవంక	4,789
వైఎస్సార్‌కాలనీ	3,729
బసినికొండ	6,044
రామాచార్లపల్లె	5,738
కొండామర్రిపల్లె	4,369
తట్టివారిపల్లె	4,212
కోళ్లబైలు	2,070
అంకిశెట్టిపల్లె	3,424
పొన్నుటిపాళెం	3,897

సగం పట్టణం మురికివాడల్లో...

మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం పట్టణంలోని సగం జనాభా మురికివాడల్లోనే నివసిస్తోంది. 42 మురికివాడల్లో పదింటికి ఇంకా అధికారికంగా గుర్తింపు ఇవ్వలేదు. 2011 లెక్క ప్రకారం 1,36,414 మంది జనాభా ఉంటే..అందులో 65,304 మంది మురికివాడల్లో నివసిస్తున్నారని అధికారిక లెక్క. దీన్నిబట్టి పరిశీలిస్తే పట్టణం ఎంత వేగంగా విస్తరిస్తోందో మురికివాడలు అదే స్థాయిలో ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇక్కడ మౌళిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలు చాలా ఉన్నాయి.

రూ.114 కోట్ల బడ్జెట్

సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఏర్పడేందుకు మదనపల్లెకు అన్ని అర్హతలు ఉన్నాయి. మున్సిపాలిటీ 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అక్షరాలా రూ.114 కోట్లు. వాస్తవంగా అధికారులు పటిష్టమైన చర్యలు చర్యలు తీసుకుంటే..ఆదాయం మరో రూ.10–రూ.20 కోట్లు పెంచుకోవచ్చని పలువర్గాలు చెబుతున్నాయి. అలాగే పట్టణంలో కలిసిపోయిన 12 పంచాయతీల ఆదాయం లెక్కిస్తే బడ్జెట్ రూ.150 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. ఆదాయపరంగా, జనాభా, విస్తరణ పరంగా మదనపల్లెను కార్పొరేషన్ చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి.

అభయమివ్వమ్మా..లోకమాతా



మహాలక్ష్మి అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు



గజలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి



రాజంపేట టౌన్: గాయత్రీదేవిగా వాసవీమాత



మదనపల్లె సిటీ: వాసవీమాతను ఊరేగిస్తున్న భక్తులు

'అమ్మలగన్న అమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. మాయమ్మ పెద్దమ్మ'.. అంటూ జగన్మాతకు ప్రణమిల్లారు. జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి.రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో ఆలయాలు శోభిల్లుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సిరులతల్లిని దర్శించుకున్న భక్తులు పరవశించి పోయారు. 'చల్లగా చూడమ్మా' అంటూ వేడుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

శభాష్.. అసద్

రాయచోటి జగదాంబసెంటర్: రెడ్ టెన్నిస్ బాల్ అండర్ –19 జాతీయ క్రికెట్ జట్టుకు రాయచోటికి చెందిన అసద్ ఎంపికయ్యాడు. శనివారం ఉత్తరాఖండ్‌లో జాతీయ స్థాయి టోర్నీలో అసద్ తెలంగాణ జట్టు తరపున పాల్గొని, జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించినట్టు కుటుంబసభ్యులు ఇక్కడి విలేకరులకు తెలియజేశారు. దీంతో అసద్ జాతీయ జట్టుకు ఎంపికై వచ్చే నెలలో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో పాల్గొంటారన్నారు. కాగా అసద్ రాయచోటిలోని నిదా టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అసద్ జాతీయ జట్టుకు ఎంపికవ్వడం పట్ల స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ జట్టుకు ఎంపికైన అసద్

ఆదిపత్యం.. అభివృద్ధికి ఆటంకం

నిలిచిపోయిన రూ.50 కోట్ల పనులు

జమ్మలమడుగు: ఇద్దరు నేతల మధ్య ఆదిపత్య పోరుతో గండికోట అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఒకరేమో అనకాపల్లి ఎంపీ రమేష్‌నాయుడు, మరొకరు స్థానిక శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సాస్కి నిధుల కింద వైఎస్సార్ జిల్లాలోని గండికోట అభివృద్ధికి 78 కోట్ల రూపాయలు కేటాయించారు. టెండర్‌ను రిత్విక్ కంపెనీ లెస్‌కు దక్కించుకుంది. దీంతో మొదటి విడతగా 50 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని సంప్రదించకుండా పనులు చేపట్టడంతో స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. సబ్‌కాంట్రాక్ట్ కింద ఇతర జిల్లాలకు చెందిన వారికి పనులు ఇచ్చారంటూ గండికోట వాసులు, స్థానిక బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడుగడుగునా అడ్డంకులే...

సాస్కి పథకం కింద గండికోటలో రహదారులు, బోటు షికారు, వసతుల కల్పన తదితర పనులు చేయాల్సి ఉంది. సెప్టెంబర్ నుంచి రిత్విక్ కంపెనీ పనులు చేపట్టింది. గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని స్థానికులు పనులను అడ్డుకున్నారు. దీంతో కంపెనీ యాజమాన్యం రెవెన్యూ, పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల పహారాలో పనులు చేపట్టారు. అయినా రెండో సారి పనులను అడ్డుకున్నారు. దీంతో ఈ పంచాయితి కలెక్టర్ వద్దకు వెళ్లినట్లు తెలిసింది. కలెక్టర్ కూడా స్థానికులకే పనులు ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయాన్ని రమేష్ నాయుడు, సురేష్‌నాయుడు వ్యతిరేకించారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. దీంతో తమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా నెల్లూరు ప్రాంత వాసులతో చేయించుకుంటారా అని బీజేపీ, టీడీపీ నాయకులు కంపెనీ కార్యాలయంపై దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈనెల 22వ తేదీ జరిగిన దాడి తర్వాత గండికోటలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో గండికోటలో అభివృద్ధి జరుగుతుందా.. లేక ఆగిపోతుందా అనే సందేహాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.



పెన్నాలోయ

పెన్షన్.. టెన్షన్!

- ● అక్టోబర్ ఒకటిన పింఛన్లు ఇవ్వమని సచివాయల జేఏసీ అల్టిమేటం
- ● జిల్లాలో 2,17,657 మందికి రూ.93.94 కోట్ల పంపిణీ జరగాలి
- ● ప్రత్యామ్నయంపై దృష్టి పెట్టని ప్రభుత్వం

మదనపల్లె: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యాచరణలో భాగంగా అక్టోబర్ ఒకటిన జరగాల్సిన సామాజిక పింఛన్ల పంపిణీ కోసం బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రాను నిరాకరిస్తూ ఎవరూ నగదు దగ్గర పెట్టుకోకూడదని నిర్ణయించారు. వచ్చే గురువారం పింఛన్ల పంపిణీ జరగాలి. తెల్లవారుజాము నుంచే పింఛన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి అందజేయాలి. అయితే సచివాలయ ఉద్యోగ సంఘాల జేఏసీలు అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రాష్ట్రంలో ప్రాంతాల వారీగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగాలన్న నిర్ణయానికి వచ్చారు. జిల్లాలో పింఛన్ల పంపిణీకి సోమవారం పోగా రెండురోజులు మిగిలి ఉంటాయి. ఈ రెండురోజుల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి ఆయా సచివాలయాల ఉద్యోగులు సన్నద్ధం కావాలి. ఒకరోజు ముందుగా బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసుకుని తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలి. ఒకటిన తెల్లవారుజాము నుంచే పంపిణీ మొదలవ్వాలి. అయితే ఇప్పటిదాకా దీనిపై స్పష్టత లేకుండాపోయింది. ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయలేదు. జేఏసీ ప్రతినిధులతో చర్చించేందుకు నిర్ణయించగా వాయిదా పడింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ముందస్తుగా చర్యలు చేపట్టి యథావిధిగా పంపిణీ చేయిస్తుందా స్పష్టత లేదు. ఒకవేళ ఉద్యోగులు సహాయ నిరాకరణ చేస్తే..వీరికి ప్రత్యామ్నయంగా సంఘమిత్ర, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు అధికారులతో పింఛన్ల పంపిణీ చేయించే అవకాశం ఉందని జేఏసీ రాష్ట్ర నాయకుడు ఒకరు చెప్పారు. అక్టోబర్ ఒకటిన జిల్లాలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లోని 500 గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 4,029 మంది ఉద్యోగులు..జిల్లాలోని 2,17,657 మంది పెన్షన్‌దారులకు రూ.93.94 కోట్లు పంపిణి చేయాల్సి ఉంది.



ఒకటిన జరగాల్సిన పింఛన్లు

మండలం	పింఛన్లు	నగదు (రూ.కోట్లలో)
బి.కొత్తకోట	7811	3.37
చిన్నమండ్యం	5025	2.13
చిట్వేలి	5560	2.37
గుర్రంకొండ	6020	2.62
కలకడ	5411	2.29
కలికిరి	6952	3.03
కేవిపల్లె	6800	2.90
కోడూరు	10,051	4.32
కురబలకోట	6415	2.80
లక్కిరెడ్డిపల్లె	4569	2.00
మదనపల్లె	14,123	5.96
మదనపల్లె టౌన్	10,780	4.71
ములకలచెరువు	6616	2.90
నందలూరు	3995	1.71
నిమ్మనపల్లె	5053	2.25
ఓబులవారిపల్లె	6289	2.70
పెద్దమండ్యం	5425	2.42
పీటీఎం	7836	3.44
పెనగలూరు	5048	2.17
పీలేరు	9691	4.11
పుల్లంపేట	4972	2.14
రాజంపేట	7468	3.22
రాజంపేట టౌన్	3132	1.37
రామాపురం	4984	2.15
రామసముద్రం	6386	2.67
రాయచోటి	4658	1.98
రాయచోటి టౌన్	8274	3.64
సంబేపల్లె	5595	2.39
టి.సుండుపల్లె	7613	3.26
తంబళ్లపల్లె	6109	2.67
వాయల్పాడు	6722	2.94
వీరబల్లి	5252	2.30

క్లుప్తంగా

నీటికుంటలో పడి హిజ్రా మృతి



మృతి చెందిన హిజ్రా శిరీష

సంబేపల్లె : నీటికుంటలో పడి హిజ్రా శిరీష (20) ఆదివారం మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బండకాడమాలపల్లెకు చెందిన హిజ్రా గ్రామ సమీపంలోని నీటికుంట వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి మృతిచెందారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కట్టా పుట్టాలమ్మ గుడిలో చోరీ



గుడిలో పగులకొట్టిన బీరువా

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట కట్టాపుట్టాలమ్మ గుడిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఉదయం గుడి తెరిచి చూడగా గుడిలో బీరువా, హుండీ పగలకొట్టి చీరలు, నగదు దొంగతనానికి పాల్పడ్డారు. జాతీయ రహదారి సమీపంలో కట్టా పుట్టాలమ్మ గుడి ఉండడంతో సీసీ కెమేరాలు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేతనాలు విడుదల చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో కెజీబీవీ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. కడప సీపీఐ కార్యాలయంలో కేజీబీవీ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 మంది మహిళా నాన్ టీచింగ్ స్టాఫ్‌కు 11 నెలల వేతనం ఇవ్వకపోవడంతో అర్ధకాలితో అలమటిస్తూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ దృష్టి కేంద్రీకరించి వేతనాల విడుదలకు కృషిచేయాలని కోరారు. లేని పక్షంలో విజయవాడ సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆమరణ దీక్షకు దిగుతామన్నారు. నిర్లక్ష్యం చేయకుండా వేతనాల విడుదలకు కృషిచేయాలని, లేకపోతే రాష్ట్ర సర్వ శిక్ష అభియాన్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు అజిత, మౌనిక, నాగమణి, కృష్ణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు..

సంప్రదాయాలకు నెలవు

బొమ్మల కొలువు కేవలం సరదా కాదు..
ఆ కొలువు మన సంప్రదాయాలకు నెలవు.
వందల ఏళ్లుగా ఆ కొలువు నిర్వహిస్తున్న వారికి ఈ విషయం తెలిసి ఉంటుంది.
ముందుతరం వారు ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును జాగ్రత్తగా కాపాడుకుంటూ
మన బొమ్మలను జతచేస్తూ..
తరం మారుతున్న కొద్దీ కొలువును మరింత అందంగా తయారు చేస్తారు.
పాతకాలం నాటి బొమ్మలు
నాటి కథాకాలక్షేపాలకు ఆచార వ్యవహారాలకు సాక్షిగా ఉంటాయి.

- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం
- పురాణేతిహాసాల్లో ఘట్టాలను వివరిస్తున్న వైనం



మదనపల్లెలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు

మదనపల్లె సిటీ : దసరా అంటేనే సందడి. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో బొమ్మల కొలువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. యువతకు బొమ్మల కొలువు అంటే కొత్త మాటలా అనిపిస్తున్నా నేటికీ కొన్ని కుటుంబాలు కొలువులు ఏర్పాటు చేస్తూ తరతరాల సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాయి. దసరా ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటుచేస్తారు. ఇంట్లో ప్రత్యేక గదిని కేటాయించి బొమ్మలు పేర్చడం కష్టంతో కూడుకున్న పనే అయినప్పటికీ ఇష్టంగా చేస్తుంటారు. తొమ్మిదిమెట్లు ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా కొలువుదీర్చుతారు. మట్టి కొయ్య, పింగాణి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు ఆకర్షణగా నిలుస్తాయి.

భద్రపరచడం కష్టమే..

బొమ్మల కొలువు పూర్తయ్యాక వాటిని భద్రపడం కీలకమని చెబుతున్నారు నిర్వాహకులు. దీనికి ఎంతో ఓపిక, సహనం ఉండాలంటున్నారు. మళ్లీ బొమ్మల కొలువు వచ్చే వరకు వాటి రంగులు ఊడిపోకుండా వాటిని జాగ్రత్తగా పెట్టెల్లో కాపాడుకుంటామని వారు వివరించారు. దుర్గాదేవితో పాటు రాముడు, కృష్ణుడు, వినాయకుడు, లక్ష్మి, సరస్వతీ, పెళ్లితంతు, జంతువులు, పక్షులు, పండ్లు, చెట్లు, ఆకులు,పురాతన కట్టడాలు, ప్రయాణ సాధనాలు, వాహనాల.. ఇలా రకరకాల బొమ్మలు ఈ కొలువులో కనువిందు చేస్తుంటాయి. వాటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

28 ఏళ్లుగా



28 ఏళ్లుగా బొమ్మల కొలువు ఏర్పాటుచేస్తున్నారు. తమ అత్తవారు కొనసాగిస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పలురకాల దేవుడి బొమ్మలు, కొయ్యబొమ్మలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పట్టణంలో పలువురు తమ ఇళ్లల్లో కొలువులు ఏర్పాటుచేశారు. స్థానిక యోగ భోగేశ్వరస్వామి ఆలయం, వాసవీ న్యకాపరమేశ్వరీ ఆలయాల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు.

- జ్యోతి శివకుమార్, ఈస్టు కొత్తపేట, మదనపల్లె పట్టణం

బొమ్మల కొలువు అంటే ఇష్టం

28ఏళ్లుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నా. మా అత్తవారి నుంచి ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నా. దసరా మొదటి నుంచి ముగిసేవరకూ ప్రతి రోజు పూజలు చేస్తాం. అందులో పెళ్లి సందడి, అష్టలక్ష్మలు, దశావతారాలు, పలురకాల దేవుడి బొమ్మలు చూసేందుకు పిల్లలతోపాటు పెద్దలు వస్తారు. బొమ్మలకొలువు అంటే నాకు ఎంతో ఇష్టం.

- ఓలేటి జ్యోతిశివకుమార్, ఈస్టుకొత్తపేట, మదనపల్లె

సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలి



పెద్దలు పెట్టిన సంప్రదాయాన్ని కాపాడడమే కాకుండా తర్వాత తరం వాళ్లకు కూడా అందించాలి. ప్రస్తుతం బొమ్మల కొలువులు తగ్గాయి. అయితే బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తే పిల్లలకు కూడా మన సంప్రదాయాలకు తెలుస్తాయి. పాతకాలం నాటి బొమ్మలు ఆ నాటి కథా కాలక్షేపాలకు ఆచార వ్యవహారాలకు సాక్షిగా ఉంటాయి.

- మోహనవల్లి, అధ్యాపకురాలు, మదనపల్లె

మిస్టరీగా మెడికల్ షాపు యజమాని అదృశ్యం

మదనపల్లె రూరల్ : గాయత్రి మెడికల్ షాపు యజమాని శ్రీకాంత్ అదృశ్యంపై మిస్టరీ కొనసాగుతోంది. అదృశ్యమై రెండురోజులు కావస్తున్నా ఇప్పటివరకూ అతడి ఆచూకీ లభించలేదు. శుక్రవారం రాయచోటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన శ్రీకాంత్ రాత్రి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అదృశ్యమయ్యాడు. శనివారం ఉదయం శ్రీకాంత్ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ చిప్పిలి సమీపంలోని హంద్రీనీవా కాలువ గట్టుపై లభించాయి. ఈ ఘటన ఆధారంగా శ్రీకాంత్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మిస్ అయినట్లుగా గుర్తించి కేసు నమోదుచేశారు. ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి డ్రోన్ సాయంతో చిప్పిలి హంద్రీ నీవా కాలువ నుంచి మొదలుపెట్టి పుంగనూరు నియోజకవర్గం ఈడిగపల్లె వరకు గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

మదనపల్లె రూరల్ : ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరు గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో ఆదివారం జరిగింది. పేయలవారిపల్లెకు చెందిన రైతు వెంకటరమణారెడ్డి(62) పొలం వద్ద పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలో ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి గాయపడ్డాడు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి..

నిమ్మనపల్లె : ఆటో బోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో ఆదివారం జరిగింది. నిమ్మనపల్లె నుంచి మదనపల్లెకు బయలుదేరిన ఆటో చల్లావారిపల్లె మలుపులో బైక్‌ను తప్పించే క్రమంలో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ ఖాసిం(38), ముష్టూరుకు చెందిన బావాజాన్(35), చెంద్రాయుడు(50), చల్లావారిపల్లెకు చెందిన హరిత(35), లీల(37) ఆమె కుమారుడు దీక్షిత్ (3) గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

స్థలం విషయంలో ఘర్షణ



దాడిలో గాయపడిన శివశంకర్, మంజుల

మదనపల్లె రూరల్ : స్థల విషయంలో జరిగిన ఘర్షణలో అక్క, తమ్ముడు గాయపడిన సంఘటన పట్టణంలో ఆదివారం జరిగింది. టీచర్స్ కాలనీకి చెందిన చిన్నప్ప కుమారుడు శివశంకర్(37) స్థానికం వారపుసంతలో కూరగాయల మండీ నిర్వహిస్తున్నాడు. ఇసుకనూతిపల్లెకు చెందిన అతడి అక్క ఇ.మంజుల(40) కొత్తిమీర వ్యాపారం చేస్తోంది. కొంతకాలంగా శివశంకర్, వారపుసంతలో మండీ నిర్వహిస్తున్న సయ్యద్ షావలి మధ్య స్థలం వివాదం ఉంది. ఆదివారం సయ్యద్ షావలి తన వద్ద పనిచేస్తున్న ఈశ్వరమ్మ కాలనీకి చెందిన యువకుడిని ప్రోత్సహించి శివశంకర్‌పై దాడికి ఉసి గొల్పాడు. దీంతో ఆ యువకుడు కొంతమందితో కలిసి శివశంకర్‌పై ఇనుపరాడ్‌తో దాడి చేస్తుండగా, అడ్డువచ్చిన అతడి సోదరి మంజులపై సైతం దాడిచేశాడు. దాడిలో అక్క, తమ్ముడు గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, విచారణ చేస్తున్నారు.

వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ ఎంపిక

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా పెరుగు వీరనారాయణ యాదవ్ ఎంపికయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

చూసుకో పదిలంగా..

'హృదయాన్ని అద్దంలా..!

యుక్త వయసులోనే 'గుండె' లయ తప్పుతోంది. 'గుండె నొప్పి' కారణంగా ఉన్న ఫలంగా కుప్ప కూలిపోతున్నారు.. ప్రాణాలు విడిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలతో గుండెను పదిలంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా.. ప్రత్యేక కథనం.



నేడు ప్రపంచ గుండె దినోత్సవం

కడప రూరల్ : మానవ శరీరంలో అన్ని శరీర భాగాలు కీలకమే. ప్రధాన భాగమైన గుండె పోషించే పాత్ర ఎంతో ప్రత్యేకమైంది. ఏదైనా సంఘటనను తట్టుకొని నిలబడినప్పుడు వాడికి 'గుండె నిబ్బరం' ఎక్కువరా..! అంటారు. అంటే గుండె సంపూర్ణ ఆరోగ్యకంగా ఉందనడానికి నిదర్శనం. అది ఎప్పుడో 30ఏళ్ల మాట. ఇప్పుడు గుండె జబ్బులు సాధారణ వ్యాధుల్లా మారాయి. ఎప్పుడు ఏ గుండె ఆగిపోతుందో తెలియని విధంగా ఆరోగ్య పరిస్థితులు మారాయి. గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య ప్రతియేటా గణనీయంగా పెరగడమే ఇందుకు కారణం. ఉచిత వైద్యసేవ ద్వారా యేటా వేలాది మంది బైపాస్‌సర్జరీలు చేయించుకున్నారు. స్టంట్లు వేయించుకుని, ఎన్‌సీడీ కార్యక్రమాల ద్వారా గుండె జబ్బుగల వారికి వైద్య సేవలన్నారు. ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. ఇలా పలు పథకాలు, నివేదికల ద్వారా గుండె వ్యాధుల తీవ్రతను తెలియపరుస్తోంది. జాగ్రత్తలతో హృదయాన్ని కాపాడుకుంటే పదికాలాలపాటు జీవించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

జీవనశైలి మార్పులతోనే

35 ఏళ్లకు ముందు ఏదైనా ఆహారం తినాలంటే నువ్వుల ఉండలు, వేరుశనగ ఉండలు, బఠానీలు, సంప్రదాయ పదార్థాలు లభించేవి. హోటళ్లలో కల్తీలేని ఆహార పదార్థాలు లభించేవి. నేడు ఆహారం విచ్చలవిడిగా లభిస్తూ మనిషి ప్రాణాల మీదకు తెస్తోంది. నూడుల్స్, బర్గర్లు, పిజ్జాల వంటి కార్పొరేట్ ఆహార పదార్థాల కారణంగా అనారోగ్యకరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. చిన్న వయస్సులోనే ఊబకాయం వస్తోంది. అందులో కీలకమైనది గుండె. ఈ భాగంలో మార్పులు సంభవించడం, రక్త నాళాలు గడ్డకట్టుకుపోవడంతో గుండె వ్యాధులు, హార్ట్ స్ట్రోక్‌లు వస్తున్నాయి.

గుండె నొప్పి లక్షణాలు

- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు
- ఛాతీలో మంట.. కొద్దిగా నడిచినా ఆయాసం
- జీర్ణాశయం పైభాగాన నొప్పి
- ఎడమచేయి, రెండు చేతుల్లో నొప్పి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.
- సాధ్యమైనంత వరకు ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- బీపీ, షుగర్‌లను నియంత్రణలో ఉంచుకోవాలి.
- 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. కొవ్వు, నూనె, మసాల పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఒత్తిడిని జయించడానికి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలి.

గుండె వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజలు గుండె వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. మంచి జీవనశైలి అలవాటు చేసుకోవాలి. ఏవైనా అనారోగ్య సమస్యలు వచ్చినపుడు తక్షణమే వైద్యులను సంప్రదించాలి. ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా ఉండాలి. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీలను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రస్తుతం గుండె వైద్యానికి సంబంధించి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ ఎన్.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కార్డియాలజీ వ్యాధి నిపుణులు, కడప

పనిగంటల పెంపు నిర్ణయం రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఏవీ.నాగేశశ్వరరావు

రాయచోటి జగదాంబసెంటర్ : కార్మిక శ్రమను దోచే పని గంటలను తక్షణమే రద్దుచేయాలని, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు అన్నారు. రాయచోటి ఎన్‌జీఓ హోంలో సీఐటీయూ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి పని గంటల పెంపు నిర్ణయం మరణశాసనంగా మారుతుందని, మూడు షిఫ్టులు, రెండు షిఫ్టులుగా మారడంతో ప్రతి ముగ్గురిలో ఒకరికి ఉపాధి పోతుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ సర్వేలో కార్మికులలో హృద్రోగ మరణాలు పెరుగుతున్నాయని, సుదీర్ఘ పనిగంటలతో మానసిక మస్యలు పెరుగుతాయన్నారు. కార్మికుల కుటుంబాలు ప్రభుత్వ నిర్ణయంతో ఛిన్నాభిన్నం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం ఉన్నప్పుడే అనేక పరిశ్రమల్లో 12 గంటలు పనిచేయించడం జరిగిందని, ఇపుడు కార్మికులతో 14, 16 గంటలు పని చేయించుకుని బానిసలుగా మారుస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయకపోతే కార్మికులు, ఉద్యోగులు పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. 12వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కొరకు దీర్ఘకాలిక ఐక్య పోరాటాలు చేయడానికి సీఐటీయూ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.రామాంజులు, హరిశర్మ, డి.భాగ్యలక్ష్మి, మెహరున్నీసా, వెంకట్రామయ్య, ఓబులమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను విభజించే హక్కు చంద్రబాబుకు లేదు

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప



మదనపల్లెకు చేరిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

మదనపల్లె రూరల్ : మాల మాదిగలను విభజించే హక్కు చంద్రబాబుకు లేదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. ఆగస్టు 3వ తేదీన కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చేరుకుంది. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం ఆధ్వర్యంలో ఈ మహా పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. నిమ్మనపల్లె సర్కిల్ నుంచి ప్రారంభమైన యాత్ర మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ విగ్రహం వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి ఎస్సీలు రోడ్లపైకి రావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొందరపాటుతో ఎస్సీ వర్గీకరణను తీసుకువచ్చి ఇపుడు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయం అంటే 15 ఏళ్ల ముఖ్యమంత్రి పదవి అనుభవించడం కాదని, మాదిగను ముఖ్యమంత్రి చేయాలని అన్నారు. అన్నదమ్ముల్లా ఉంటున్న దళితుల మధ్య లేనిపోని తగాదాలు పెట్టి, వారిని రోడ్లపైకి తీసుకువచ్చిన చంద్రబాబు వైఖరి తప్పు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చింది ఆర్డర్ కాదని, డైరెక్షన్ ఇచ్చిందని, దాని ఆధారంగా దళితులను విభజించడం దుర్మార్గపు చర్య అన్నారు. చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు, రాజ్యాంగ స్ఫూర్తికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. దళితులకు అన్యాయం చేసే ప్రభుత్వాలను కూల్చడంతోపాటు, వారిపై చర్యలు తీసుకునేందుకు రాజ్యాంగంలో చట్టం తీసుకురావాలన్నారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలాసుదర్శన్ మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాలన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. దళిత క్రిష్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూటర్ ఢీకొని వృద్ధురాలు దుర్మరణం



విగతజీవిగా పడి ఉన్న ఆదిలక్ష్మమ్మ



తీవ్రంగా గాయపడిన సాయికిరణ్, సుగుణ

ఒంటిమిట్ట : మండలంలోని మంటపంపల్లి సమీపాన ఇరుకురాళ్ల బోటు వద్ద కడప–చెన్నై జాతీయ రహదారిపై స్కూటర్ ఢీకొని వృద్ధురాలు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. నందలూరు మండలం ఇసుకపల్లికి చెందిన సాయికిరణ్(19), రాజంపేట మండలం నూనెవారి పల్లికి చెందిన సుగుణ(16), తమ బంధువైన కడప రవీంద్రనగర్‌కు చెందిన పట్నం అదిలక్ష్మమ్మ(65)తో కలిసి కడపకు బయలుదేరారు. మంటపంపల్లి సమీపాన ఇరుకురాళ్ల బోటు వద్ద ఉన్న కడప-చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్కూటీలోని ముగ్గురు చెల్లాచెదురుగా పడిపోయారు. తీవ్రగాయాలైన ముగ్గురిని పోలీసులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న ఆది లక్ష్మమ్మ కడప రిమ్స్‌కు చేరకముందే మృతిచెందారు. మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఒంటిమిట్ట సీఐ బాబు వివరణ కోరగా ప్రమాదానికి కారణమైన వాహనం ఇంకా ట్రేస్‌అవుట్ కాలేదని, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం

విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు

బ్రహ్మంగారిమఠం : విశ్వ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ఉద్యమిస్తామని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. బ్రహ్మంగారిమఠంలోని విరాట్ విశ్వకర్మ భవన్‌లో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. తెలంగాణ అడిషనల్ పోలీస్ కమిషనర్ కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు సాగితే రాజ్యాధికారంలో వాటా సాధ్యమని తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం లీగల్‌సెల్ చైర్మన్ పేరుసోముల గురు ప్రసాద్ ఆచారి మాట్లాడుతూ నంద్యాల జిల్లాకుగానీ, కొత్తగా బద్వేలు జిల్లా ఏర్పడితే దానికి వీరబ్రహ్మేంద్రస్వామి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు జవ్వాది కూర్మాచార్యులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు ప్రతి ఎన్నికల్లో ఎంపీ, రెండు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఇ.వెంకటాచారి మాట్లాడుతూ తిరుమలలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, వసతిగృహం నిర్మాణం కోసం భూమి కేటాయించాలని టీటీడీ కోరింది. విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి మాట్లాడుతూ మంగళ సూత్రం తయారీ హక్కుదారులుగా విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారులకు వీలు కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ దార్ల పాపయ్య, విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు అంగలకుదిటి సుశీల, తాళభద్ర వాసవి, నాగార్జున, తుంపాల వెంకటేశ్వర్లు, లక్కోజు సుజాత, వినుకొండ సుబ్బారావు, శ్రీనివాస ఆచారి, దశరథ ఆచారి, రంగాచారి, అప్పలస్వామి, శేషగిరి రావు, శేష బ్రహ్మ ఆచారి, చిలకపాటి మధుబాబు, మోడపల్లె నాగు, రామకృష్ణ ఆచారి, పద్మావతి, సాయి, శివ, ఫణీంద్రకుమార్, వీరాచారి, పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనాలు మంజూరుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆశాలకు మెరుగైన వేతనాలిచ్చి.. ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి గౌరవాధ్యక్షుడు గుంటివేణుగోపాల్ డిమాండ్ చేశారు. నగరంలోని ఏఐటియూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేయమంటున్నారని, ఆశాలకు ముఖహాజరు పెట్టారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, కరోనా, టీబీ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని అక్టోబర్ 7న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రం ఇస్తామని, ఆర్డీవో కార్యాలయాల్లో వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అప్పటికీ పరిష్కరించకపోతే కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాగసుబ్బారెడ్డి, కెసీ.బాదుల్లా, మరియమ్మ, బాలకుళ్లాయమ్మ, అనసూయ, వరలక్ష్మి, అమ్ములు, బాలగంగమ్మ, లక్ష్మీనరసమ్మ, వహీదా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఔట్‌సోర్సింగ్‌ఉద్యోగుల సంఘ రాష్ట్ర చైర్మన్ దూసి భానుజీరావు కోరారు. ఆదివారం గుంటూరు ఉద్యాన శాఖ మిని మీటింగ్ హాలులో ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించి 11 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎనుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ భానుజీరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖలలో తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని, వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.